# డొల్ల

**— చంద్రలత**



**తూ**రుపు ఎర్రబడడానికి ఇంకా చాలా సమయమే వుంది.

చిక్కటి చీకటి నా చుట్టేకాక నా గుండెల్లోనూ నిండి వుంది.

ఈ చీకటి గుండెలో తూరుపు విచ్చుకోకూడదన్న దురాశా వుంది. కాలచక్రాన్ని కదలనీయకుండా కళ్ళెం వేయాలన్న అత్యాశా వుంది.

నా పరిస్థితిలో వున్న వారెవరైనా ఇలాగే ఆలోచిస్తారేమో !

నిశ్శబ్దంగా - చాప కింద నీరులా - కదిలిపోతోన్న ఆ కాల పురుషుడు తన కబంధ హస్తాలతో నన్ను కబళించబోతున్నాడు. నిశ్శబ్దంగానే నన్ను మృత్యుదేవతకు అప్పగించబోతున్నాడు.

నేను ఉరికి సిద్ధంగా వున్న ఖైదీని !

ఈపాటికే మీకు నాపై ఓ అభిప్రాయం ఏర్పడిపోయి వుంటుంది. కాకలు తీరిన బందిపోటులానో ... కరడు గట్టిన హంతకుడిలానో ... మరోలానో మీ మనసులో నా రూపం ఏర్పడిపోయి వుంటుంది. బహుశా నాపై ఏహ్యభావమూ బలపడిపోయి వుంటుంది. నేను అలాంటి వారి జాతికి చెందిన వాడిని కాను.

నేను ఎంతో బుద్ధిమంతుణ్ణి. విద్యావంతుణ్ణి, సద్గుణ సంపన్నుణ్ణి. రూపంలో వంకలేని అందగాడిని.

అయితే - నేనూ బందిపోటునే ! నేనూ హంతకుడినే !

లోకం ఇచ్చిన నిర్వచనంలో కాదు కానీ మీరెవరో ఇచ్చిన ఆదేశంలో ! చేసిన పాపం చెబితే పోతుందంటారు. పాపమో పుణ్యమో చెబితేనేగా తెలిసేది ! చావుకు దగ్గరపడుతోన్న ఉద్వేగంలో చెప్ప లేకపోతున్నా, నా మనసు విప్పి అన్నీ చెప్పాలనే నిర్ణయించుకొన్నాను. పాపమో పుణ్యమో మీరే నిర్ణయించండి.

ఇది చావు ప్రేరేపించగా నేను చేస్తోన్న గోడు లేదా సొద కాదు. జీవితంలో మొదటి సారిగా నిజాయితీగా నన్ను నేను చూసుకొని మీకు చూపించే ప్రయత్నం మాత్రమే.

ఇప్పటికే నాపై మీకేర్పడిన భావచిత్రం లోంచి కాక మరింత విశాల దృక్పథంతో, సావధానంగా, సానుభూతిగా నామాటలను ఆలకించమని ప్రార్థిస్తున్నాను.

ఇలాంటి సమయాల్లో చెప్పే విషయాలకి ఎంతో ప్రాధాన్యత వుంటుంది కదా ! మరణ వాంగ్మూలం మరి !

అమ్మ వడిలో కళ్ళు తెరిచినపుడు నేనూ అందరి లాంటి వాడినే. స్వచ్ఛమైన పువ్వులాంటి వాడినే. ఏ చిన్న అలికిడికైనా ఏ చిన్న తాకిడికైనా అమ్మ ఆదరణకై, ఆశ్రయానికై తపించిపోయే చిన్నారి పసికూననే.

నిజానికి, నా చుట్టూ ఓ గిరి ఎప్పుడు

గీసుకొన్నానో - నన్ను నేను గుర్తించలేనంత దుర్భేద్యమైన కవచం నన్ను ఎప్పుడు కప్పి వేసిందో - నాకు తెలియనే తెలియదు.

మానవ సహజ ప్రకటితాలైన భయాందోళనలు, ప్రేమాభిమానాలు కూడా అంటనివ్వని ఆ కవచం అంటే నాకెందుకో విపరీతమైన అభిమానం.

నేను ఆ కవచం ! ఆ కవచమే నేను !

ఆ కవచం దానికై అది ఏర్పడిందని నేను ఖచ్చితంగా చెప్పలేను.

ప్రకృతి సహజం కాదు కదా ? మరి ఎప్పుడు, ఎలా, ఎందుకు ఏర్పడింది - అని ఎవరైనా అడిగితే సమాధానం లేదు.
అహ ! సమాధానం
ఆలోచించొద్దూ ?

> "మానవ సహజప్రకటితాలైన భయాందోళనలు, ప్రేమాభిమానాలు కూడా అంటనివ్వని ఆ కవచం అంటే నాకెందుకో విపరీతమైన అభిమానం".

కనీసం ఈ పూటైనా !

బుడి బుడి నడకల నాడు బవిరిగడ్డం బాబాయిని చూసి - బూచాడనుకొని అదిరి బెదిరి - అమ్మ కుచ్చిళ్ళలో తలదాచుకోవాలని ప్రయత్నించినపుడు - అమ్మ ఎత్తుకొని గుండెలకు హత్తుకొని - సత్యం బోధపరచక పోగా .. ఆడపిల్లలా అలా పరిగెత్తుకొస్తావేమిటిరా ! మగపిల్లాడివి మగ పిల్లాడిలా వుండమని గద్దించినపుడు - నా భయాన్ని కప్పేయను ఈ కవచం అక్కరకొచ్చి వుండొచ్చు.

నాకు రెండింతలున్న అక్క రెండిళ్ళ వతలకి వెళ్ళడానికి నన్ను తోడుగా రమ్మని బతిమిలాడినపుడో -

పనిమనిషి రాక నానా తిప్పలు పడుతోన్న అమ్మకు, అక్కకు సాయంగా ఓ బిందె నీళ్ళు తేబోయినపుడు నీకెందుకురా ఈ ఆడాళ్ళ పనులని అమ్మ వారించినపుడో -

అక్క గ్రాఫ్ కాగితానికి రూపా యివ్వడానికి పది ఆరాలు తీసే నాన్న నా క్రాఫ్‌కని అడిగిందే ఆలస్యంగా చేతికందినంత అందించినపుడో -

రూపాయో రెండో చాటుగా తీసుకొని, సిగరెట్టో మరేదో వెలగబెడుతున్నపుడు అక్క చూసి, అమ్మతో ఫిర్యాదు చేస్తే ... మగాడు వాడేం చేసినా చెల్లు ! చూసింది నీ నేరమని.. అమ్మ అక్క మీదే విరుచుకు పడినపుడో -

మరెపుడో .... ఇంకెపుడో..... అది ఏర్పడి వుండొచ్చు.

ఈ కవచం వలన నాకెంతో సౌఖ్యమూ సౌలభ్యమూ కూడా.

అమ్మలా బాదరబందీలు లేవు. అక్కలా అడుగు వేయాలంటే అరవై నాలుగు ఆలోచించాల్సిన అవసరం లేదు. నాన్నలా ఠీవిగా ధీమాగా, దర్జాగా బతికేయచ్చు.

అయితే ఆ కవచం మాటున నన్ను వణికించిన క్షణాలు లేకపోలేదు. నేను బాధపడిన క్షణాలు లేకపోలేదు. నేను అసూయ పడిన క్షణాలు లేకపోలేదు.

అందరికి మల్లేనే చీకటంటే నాకూ భయమే. వంటరి రాత్రి భయానకమై వణికించినపుడు అక్క కన్నా నేనే ఎక్కువ భయపడ్డది నిజం. కానీ నా కవచం చాటున భయం బయటపడకుండా బతికేయడం అలవాటు అయింది.

ధైర్యానికి, బింకానికి ఎంతో తేడా, నేనెంతో ధైర్యవంతుడినని నన్నాశ్రయించే అమ్మ అక్క నాది ఒట్టి బింకమేనని ఊహించలేరేమో.

నిజానికి నాలో భయం దాగుందని ఈ క్షణం వరకూ నేనే తెలుసుకోలేక పోయాను.

కానీ అదేమిటో, ఇంక కొద్ది గంటల్లో నా బింకం శాశ్వతంగా నల్లగుడ్డతో కప్పబడి తాడుకు వేళ్ళాడబోతున్నా - నాలో భయం భయంగా బహిర్గతమవడం లేదు. ఇప్పుడూ భయాన్ని బింకమే జయిస్తోంది !


ఇక నా కవచం మాటున నేను బాధపడ్డ క్షణాలను నేనసలు మరవలేను.

డాక్టరు కావాలని శాయశక్తులా ప్రయత్నిస్తోన్న అక్కను ... నన్నెక్కడ మించి పోతోందోనన్న భయంతో నాన్న చదువాపించి ఇంట్లో కూచోబెట్టినపుడు నేను బాధపడకపోలేదు.

అక్క నాన్నను బతిమిలాడో బామాలో చదువు కొనసాగించాలని ప్రయత్నించక పోవడానికి బాధ పడక పోలేదు.

నిజానికి మా స్కూల్లో మాష్టార్లందరి అభిమానం సంపాదించుకోవడం అక్కకే సాధ్యమైంది. నన్నెపుడూ ఫలాన అమ్మాయి తమ్ముడిగా ప్రస్తావించడంమాత్రం నాకు నచ్చలేదు.

అయితే, ఆటలపోటీల్లో అక్క నెగ్గినపుడు ... పాటల్లో ప్రత్యేక ప్రశంసలందు కొన్నపుడు అందరిలాగే నాకూ ఘనసారా అభినందించాలనిపించింది. అదేమిటో కానీ నా గొంతుకేదో అడ్డం పడ్డట్లయి ఒక్కమాట



కూడా మాట్లాడలేకపోయాను.

నాకు ఒక్క బహుమతి రాకపోవడంతో చిన్న బుచ్చుకున్నా ననుకొన్నారో ఏమో గానీ అక్క గెలుచుకున్న పింగాణి వాజ్‌ను నాన్న నిర్దాక్షిణ్యంగా వీధిలోకి గిరాటేస్తే, ఇత్తడి పూలసజ్జను అమ్మ అటక మీద పడేసింది.

నాకు చివుక్కుమనిపించింది. కానీ అదేంటో నా మొహాన ఓ సన్నని నవ్వు కదలాడింది. అమ్మ నాకు మెటికలు విరిచి - తన పనిలో తను పడింది. అక్క మాత్రం ఎప్పటిలానే చిరునవ్వులు చిందిస్తూ అమ్మను అనుసరించింది.

అక్కలో అర్థం కాని విషయం అదే. ఏం విరుచుకు పడినా అలా తొణక్కుండా ఎలా వుండగలదో !

గట్టిగా మాట్లాడకు, గట్టిగా నవ్వకు, పరిగెత్తకు, గెంతకు అంటూ అమ్మ అరవైఆరు అంక్షలు పెట్టినా అలానే వుంటుంది. నాన్న పెట్టే అర్థం పర్థం లేని వంకలకూ వ్యంగ్యాలకూ అలానే స్పందిస్తుంది.

మొదట్లో అక్క బదులు నేను బాధపడినా, మథనపడినా తరువాత తరువాత అక్క మొహంలో ఆ చిరునవ్వు లేకుండా చూడాలన్న కోరిక మొదలై ... మెల్లి మెల్లిగా బలపడింది.

అక్క చదువు మానేసి ఇంట్లో వున్నా వీధి మొత్తంలోకి బుద్ధిమంతురాలిగా, పనిమంతురాలిగా ఇట్టే పేరు సంపాదించేసింది. కుట్లు అల్లికలు, వంటలు వార్పులు అన్నిటిలో ప్రావీణ్యత సాధించింది. ప్రైవేటుగా ఏవో పరీక్షలకు కట్టింది. మా వీధిలో కొత్తగా పెట్టిన టైపులో చేరింది.

నాలో ఏదో తెలియని అలజడి మొదలయ్యింది. అక్కను ఘోరంగా ఆట పట్టించి, ఏడిపించాలని ఎన్ని విధాలుగా ప్రయత్నించినా - అక్క తేలిగ్గా నవ్వేసి ఊరుకొనేది - నన్ను మాట మాత్రం కోప్పడకుండా.

అక్క వాళ్ళ టైపు మాష్టారు మా పక్కయింట్లోనే అద్దెకు వుంటున్నాడు.


నాకు ఓ చిలిపి ఆలోచన వచ్చింది. వ్రాత మార్చి.. అతను వ్రాసినట్లుగా అవాకులు చవాకులతో అక్కకో వుత్తరం వ్రాసాను. అది నాన్న దృష్టిలో పడేట్లు చేసాను.

నాన్న భూనభోంతరాలను ఏకం చేసాడు. నిప్పులు కడిగిన వంశంలో అక్క తప్పబుట్టింది అన్నాడు. తిట్టి తిట్టి చివరకు.. ఏ ఏట్లోనో దూకి చావమన్నాడు.

నేను నాన్న తాండవాన్ని, తిట్ల పురాణాన్ని మహదానందంగా వీక్షిస్తున్నాను. అయితే నా సరదా కాస్తా చప్పున చల్లారి పోయినది. అక్క కంట చిన్న చుక్కైనా కారలేదు. పెదాల మీద మెరిసే చిరునవ్వు చెరగనే లేదు. చివరకు ఆ మర్నాటి ఉదయం మా పెరటిబావిలో అక్క శవమై తేలినా !

ఈ అనూహ్య పరిణామానికి నాకు మతిపోయినంత పనయ్యింది. ఏదో వేళా కోళానికి చేసిన తుంటరిపనికి పర్యవసానం ఇదా ?

విచిత్రంగా నాన్నగానీ, అమ్మగానీ కంటతడి పెట్టలేదు. మా కుటుంబ స్వచ్ఛతను మరోమారు నిరూపించిన అక్కకు ఘనంగా జోహార్లర్పించారు.



నా మనసు కూడా కుదుట పడింది. అయితే చివరి దాకా చెరగని అక్క చిరునవ్వు నన్ను వెంటాడుతూనే వుంది. వెక్కిరిస్తూనే వుంది. ఆ నవ్వుని భరించేశక్తి నాకు లేదు. భరించలేను.

అక్క విషయంలో నేనేమీ చేయ లేకపోయినా - రమ్య విషయంలో నేననుకొన్నది సులువుగానే సాధించగలిగాను.

రమ్య నా భార్య. మాది ప్రేమ వివాహం. రమ్య నాతో పాటే చదువుకొనేది. నేనేమో డొనేషన్ ఇంజనీర్‌ని అయితే రమ్య ర్యాంక్ ఇంజనీర్.

ర్యాగింగ్ సమయంలో ఎన్నో రకాలుగా ఉడికించి, ఏడిపించి, ఆనందించేవాడిని. రమ్యలో నాకు నచ్చిన విషయం అదే - ఏ చిన్న మాటన్నా ముడుచుకు పోతుంది. బొటబొటా కన్నీళ్ళు కారుస్తుంది. అక్కలాగా తొణక్కుండా వుండడం రమ్యవల్ల కాదు.

నిజానికి రమ్యలో వేలెత్తి చూపాల్సిన విషయాలేం లేవు. అమ్మ కన్నా, అక్కకన్నా సమర్థురాలే. ఇంటిని చక్కగా వుంచుకొంటుంది. అరిసెలు, ఆవకాయ దగ్గర్నించి పీజాస్, బర్గర్స్ వరకు నోరూరించేలా వండే నైపుణ్యం వుంది. రూపలావణ్యంలో వంకే లేదు. వుద్యోగం వుంది. నన్ను ప్రాణంలా చూసుకొంటుంది. అమ్మా నాన్న అంటే గౌరవం.

అన్నిటికి మించి వారందరి అభిమానంతో పాటు గుణవంతురాలు, పనిమంతురాలు, బంగారు బొమ్మ ... వగైరా వగైరా బిరుదాలన్ని సంపాదించుకొంది.

సరిగ్గా ఇక్కడే రమ్య నాకు నచ్చడం మానేసింది.

ఆ మాటలన్నీ రమ్యను ప్రశంసించ డానికి కాక నన్ను ఎత్తిపొడవడానికి అన్నట్లుగా తోస్తుంది.

అలాంటి బాధలో మునిగి వున్నప్పుడే ఆకస్మాత్తుగా నా కవచం నేనున్నానంటూ నా వెన్ను తట్టింది. నేను నేనుగా మారాను.

ఒక కారణం, ఒక విషయం అని లేదు - అన్నిటికి నా చెయ్యి అస్తిత్వం నిరూపించు

కోవడం మొదలెట్టింది.

చెయ్యికి హృదయం లేదు. మెదడు అంతకన్నా లేదు.

అందుకే స్నానానికి నీళ్ళు తోడినా, తోడకపోయినా, కూరలో కరివేపాకు వేసినా, వేయకపోయినా, రమ్య మంచి చీర కట్టుకున్నా - కట్టుకోకపోయినా, ఇలా అయినా అలా అయినా - నా చెయ్యి రమ్య వంటి మీద మొరటుగా నర్తిస్తోంది.

రమ్య ఏమనుకుందో ఏమో పుట్టింటికి వెళ్ళింది.

అక్కడ జరిగే తతంగమేమిటో నాకు బాగా తెలుసు.

కుటుంబానికి అప్రదిష్ట తేవద్దనీ ఇలాంటి పరువు తక్కువ పనులు చేయొద్దనీ మావయ్య విరుచుకు పడి వుంటాడు.

మగ మహారాజు ఆయనెట్లా చేసినా నువ్వు సర్దుకుపోవాలి గానీ ఇలా వీధిన పడతావేమిటే అని అత్త గడ్డి పెట్టుంటుంది.

రమ్య వదిన ఇంటా వంటా ఇట్లాంటి బరితెగించిన పనులు లేవని ఈసడించుకొని వుంటుంది.

ప్రేమించి మరీ కట్టుకున్నావ్‌గా అనుభవించు అని బావమ్మరిది తెగేసి చెప్పుంటాడు.

నేను రెండ్రోజులాగి అత్తగారింటికి వెళ్ళాను.

నా సత్ప్రవర్తనకూ, రమ్యపై నేను కురిపించిన ప్రేమాభిమానాలకు అందరూ ముగ్ధులైపోయారు. నా ఎదుటే రమ్యను నానా చీవాట్లు పెట్టారు. రమ్య చేసిన తెలివితక్కువ పనికి రమ్య తరుపున క్షమాపణలడిగారు. నా చేతులు పట్టుకొని బతిమిలాడి - రమ్యను నా వెంట పంపించారు.

నా కవచమే నన్ను కాపాడకపోయి వుంటే ఆ క్షణంలో రమ్య కళ్ళల్లో రగిలిన భావ జ్వాలల్లో నేను మాడి బూడిదై వుండే వాడినేమో!

విజయగర్వంతో ముసి ముసి నవ్వులు నవ్వుతూ నేను గడప దాటబోతుంటే - "బావగారూ.. అన్ని రోజులూ మీవే కావు!" స్పష్టంగా, హెచ్చరికగా, నాకే వినిపించేలా పలికిందో కంఠం.

నేనో క్షణం దిమ్మెరపోయాను. ఆ కంఠం

## తెలుగుకి హిందీ వెలుగు 'వర్తమాన్ సాహిత్య'

ఈ మధ్య తెలుగు కథలూ, కవిత్వం మీద ఇతర భాషల వాళ్ళు ప్రత్యేక సంచికల్ని విశేషంగా తీసుకువస్తున్నారు. 'వర్తమాన సాహిత్య' అనేవొక ప్రత్యేక తెలుగు సాహిత్య సంచిక హిందీలో వెలువడింది. తమ విశేషమైన ప్రతిభతో, దృక్పథంతో ఇటీవల తెలుగు సాహిత్యాన్ని వొక మలుపు తిప్పిన కవులు, కథకుల విశేష రచనలు ఈ సంచికలో వున్నాయి తెలుగు సాహిత్య నేపథ్యం గురించి నిఖిలేశ్వర్ రాసిన ప్రత్యేక పరిచయ వ్యాసంతో మొదలైన ఈ సంచికలో నగ్నముని, జ్వాలాముఖి, జయప్రభ, వరవరరావు, శివసాగర్, అఫ్సర్ ప్రభృతుల కవితలూ, అల్లం రాజయ్య పెద్దకథ, ఈతరం కథకుల కథలు కొన్ని.. వున్నాయి, తెలుగు సాహిత్యదృక్పథ పరిణామాన్ని వివరిస్తూ జ్వాలా ముఖి రాసిన వ్యాసం సమగ్రంగా వుంది.

రశ్మిది.

రశ్మి నా మరదలు. రశ్మి రమ్యలా మెతకది కాదు. సిసింద్రీ. సీమటపాకాయ. ఎప్పుడు ఏం చేస్తుందో చెప్పలేం. రశ్మి చిన్నపిల్లయినా నాకెందుకో భయం. నేను రమ్యని పట్టించుకోనట్లే ముందుకెళ్ళి పోయాను.

మాయింటికి వెళ్ళాక షరా మామూలే.

అలవాటుపడ్డ మత్తుమందు పరిణామం పెంచుకొంటూ పోతేకానీ మత్తెక్కదు. మజారాదు.

అలాగే ఓ ఎత్తిపొడుపుకో, ఓ చెంపదెబ్బకో తృప్తిపడే నా మనసు ఇప్పుడు ఎంతకీ తృప్తిపడడం లేదు. రమ్య కూడా మునుపటిలా ముడుచుకు పోవడం లేదు. నిర్లిప్తంగా వూరుకుంటోంది.

రోజులు గడిచిపోతున్నాయి. చిట్టి పుట్టింది. పెరిగింది. అయిదేళ్ళదయింది.

మా దినసరి కార్యక్రమంలో మాత్రం మార్పు లేదు. చిట్టి పుట్టాక రమ్య రెండు మూడు సార్లు ఉద్యోగం మానేస్తానంది.

ఎలా కుదురుతుంది? కారు కొనాలని, సొంత యిల్లు కట్టుకోవాలని నాకెన్నో ఆశలున్నాయి. నిజానికి నా ఉద్యోగం నా కుటుంబావసరాలకన్నా ఎక్కువే అందిస్తోంది. అయినా నేను రాజీపడలేను.

రమ్యకు ఆఫీసులో కూడా మంచి పేరుంది. రమ్య డిజైన్ చేసిన ఓ ఫైవ్‌స్టార్ హోటల్ వల్ల వారి కంపెనీకి మంచి గుర్తింపు వచ్చింది. వాళ్ళంతా రమ్యకు నీరాజనం పట్టారు. నేను కూడా ఆ కార్యక్రమానికి వెళ్లాను. అందరూ - సహకరించే భర్త వుండడమే ఆమె విజయానికి మూలకారణమని పనిలో పనిగా నన్నూ పొగిడారు.

రమ్య మాత్రం ఏ స్పందనా లేని బొమ్మలాగా వుండిపోయింది.

నేను ఆ వుత్సాహంతో నా మిత్రులను



ఇంటికి భోజనానికి ఆహ్వానించాను.

మాతో పాటు చదువుకున్న కుమార్ ఇపుడు రమ్య ఆఫీసులోనే పని చేస్తున్నాడు. ఫోం చేసి - పోతూ పోతూ అన్నాడు, "ఎందుకోరా - రమ్యలో అప్పటి ఉత్సాహం గానీ, ఉత్తేజం కానీ కనిపించడం లేదు. అంతా మొక్కుబడిగా, అయిష్టంగా చేస్తున్నట్లుగా వుంది. ఆవిడకు పని ఎక్కువగా వుందేమో ! ఈ కంపెనీ వాళ్ళు వాళ్ళ లాభాలే. చూస్తారు గానీ స్వయం ప్రతిభను స్వేచ్ఛగా బహిర్గతమవ్వనివ్వరు. పైనుంచి బాగా వత్తిడి ! అంత చదువు చదివీ, అంత ప్రతిభ వుండీ, అంత ప్రావీణ్యత సాధించీ అణిగి మణిగి వుండడం దుర్భరం కదూ ? నేనూ ఉద్యోగం మానేసి, స్వంతంగా చేసుకుందా మనుకుంటున్నా !"

కుమార్ మాటలు నాకు చెళ్ళున తగిలాయి. పైకి నవ్వుతూ అంత గొప్ప సలహా ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పి గేటు దాకా సాగనంపాను.

నేను లోపలకి వచ్చేసరికి రమ్య వంట గది సర్దుకుంటోంది. నేనుగుమ్మంలోనిలబడి వున్నా రమ్య నన్ను పట్టించుకోలేదు. రమ్య ధ్యాస మరెక్కడోవుంది. ఆమె చేతులు యాంత్రికంగా, చక చకా గిన్నెలు సర్దుతున్నాయి.

నేను రమ్య మొహంలోకి చూస్తూ వుండి పోయాను.

రమ్య నాకు మొదటిసారి పరిచయమవ్వడం గుర్తొచ్చింది. చిరునవ్వులు చిందిస్తూ - లావణ్యలతలా ఎంత అందంగా వుండిందో ! నవ్వు లేని రమ్య మొహం వెన్నెల లేని జాబిలిలా లేదూ ? రమ్య మొహంలో చిరునవ్వులు దోచేసింది నేనేనా ?

నాలో ఎక్కడో కలుక్కుమంది.

రమ్య ఎందుకో గబ గబ రాబోయి గుమ్మంలో నిల్చున్న నాకేసి దబామని కొట్టుకుంది. చేతిలో వున్న గిన్నెలోని పెరుగంతా నా మీద దొర్లించేసింది. గిన్నె దడ దడమంటూ నేల మీద పడింది. రమ్య బిత్తరపోయింది.

నేను రమ్య మొహం మీద నుంచి చూపు మరల్చలేదు.

రమ్య పెదాలు తడిచేసుకొంటూ - భయం భయంగా వెనుకకు నడిచింది.

నేను ఏమీ మాట్లాడకుండా, పెరుగు తొక్కకుండా జాగ్రత్తగా ఒక్కో అడుగే ముందుకు వేస్తున్నాను.

నాకు పెళ్ళికి ముందు రమ్యతో కలబోసుకున్న కమ్మని కబుర్లు, చేసిన షికార్లు అన్నీ ఒక్కసారిగా గుర్తొచ్చాయి. సిగ్గుల మొగ్గ రమ్య నా కళ్ళముందు కదలాడింది.


ఆ క్షణంలో రమ్యలో బహుశా ఇలాంటి భావాలేం వున్నట్లు లేవు. వణుకుతూ గోడకు నక్కి గట్టిగా కళ్ళు మూసుకొంది.

నేను రమ్య మొహంలో మొహం పెట్టి, అలనాటి నవ్వు కోసం ఆత్రంగా వెతికాను.

రమ్య గబుక్కున కళ్ళు తెరిచింది. నా వాలకం చూసి బెదిరినట్లుగా చూసింది. నేను నవ్వు తెచ్చుకొని - ఒక్కసారి రమ్యను నవ్వమన్నాను.

రమ్య మరింత బిగుసుకు పోయింది.

బతిమిలాడాను. ప్రాధేయపడ్డాను. నవ్వలేదు.



నాకు కోపం ముంచుకొచ్చింది. రాదు మరీ ? నవ్వమంటే నవ్వడానికేం బాధ ?

రమ్య జడ కుదుళ్ళు పుచ్చుకొని గట్టిగా లాగి ఒక్కసారి నవ్వమన్నాను. ఊహు ! భుజాల్ను పట్టి కుదిపాను. ఆ చెంపా ఈ చెంపా వాయించాను. రమ్య నవ్వలేదు.

నాకిక ఆవేశం కట్టలు తెంచుకుంది. నేను చెప్పిన మాట రమ్య వినకపోవడమా ! ఏమిటంత అహంకారం ?

రమ్య గొంతు చుట్టూ నా చేతులు వేసి - బెదిరించాను.

రమ్య నవ్వకపోగా వల్లెత్తుమాట అన్లేదు. నిలువు గుడ్లేసుకొని వెర్రిదానిలా నన్నే చూస్తోంది.

నేను బిగ్గరగా "నవ్వు" "నవ్వు" అని అరుస్తూ - ఎప్పుడో నాకు తెలియకుండానే చేతులు గట్టిగా బిగించాను.

చివరికి రమ్య పెదవులు విచ్చుకొన్నాయి. చిరునవ్వుతో కాదు. వెళ్ళబొడుచుకొచ్చిన నాలుకతో !

నాకు విషయం అర్థం అవగానే కోపం చప్పున చల్లారిపోయింది. చేతులు పట్టు విడిచేసాను. రమ్య కుప్ప కూలి పోయింది.

నా జీవన జ్యోతి ఆరిపోయింది. నా రమ్య చచ్చిపోయింది.

నేనూ రమ్య పక్కనే కూలబడ్డాను.

రమ్య ప్రాణాలు తీయడం నా అభిమతమే కాదు. ఏదో పంతం నెగ్గించుకోవాలన్న మొండితనమే కానీ... కానీ...

నా ప్రియాతి ప్రియమైన రమ్య ... నా ప్రాణంలో ప్రాణమైన రమ్య ... మాటా పలుకూ లేకుండా ... నా ముందే శవమై పడి వుంది.

నాకు కాళ్ళూ చేతులు ఆడలేదు. నా బుర్రలో ఏవేవో సంఘటనలు మెదిలాయి. చటుక్కున నాకొక ఆలోచన తట్టింది. స్టవ్ యాక్సిడెంట్ !

గుండె దిటవు చేసుకొని - కిరసనాయిలు వెతికి తెచ్చాను. రమ్యకు ముందు జాగ్రత్త ఎక్కువ కిరోసిన్ స్టవ్ - కిరసనాయిలూ సిద్ధంగానే వున్నాయి.

కిరసనాయిలు రమ్య మీద గుమ్మరించి - అగ్గిపుల్ల గీసి పడేసాను.

రగ్గు తీసుకొచ్చి రమ్యను చాపలా చుట్టాను. మంటలు ఆరిపోయాయి. సుకుమారమైన రమ్య, అందమైన రమ్య .... రమ్య రూపం ఎంత భీకరంగా మారిందో... నేను చెప్పలేను.

నా చేతులు కూడా బొబ్బలెక్కాయి. నిజానికి బొబ్బలెక్కేలా నేను జాగ్రత్త పడ్డాను. గబ గబ తలుపులు తీసి పక్కింటి వాళ్ళని, ఎదురింటి వాళ్ళని కేకేసాను.

వేగంగా ఇంట్లోకి వచ్చిన నాకు రమ్య పక్కన నిల్చుని వున్న చిట్టి కన్పించింది. అవును ! ఇంట్లో ఇంకో మనిషి వుందన్న సంగతి ఇప్పటి దాకా మర్చిపోయాను !

చిట్టి కూడా వాళ్ళమ్మ లాగే మిడిగుడ్లేసుకొని, కళ్ళార్పకుండా నన్నే చూస్తోంది. నాకెందుకో వళ్ళు జలదరించింది. రమ్యే చిట్టి కళ్ళల్లోంచి చూస్తున్నట్లుగా అనిపించింది. నేనిక ఆలస్యం చేయలేదు. చిట్టిని వాటేసుకొని బావురుమన్నాను. హృదయ విదారకంగా ఏడిచాను. వెక్కిళ్ళు పెట్టాను. చిట్టి కిక్కురు మనలేదు.

వీధిలో జనాలు, మా మిత్రబృందం అంతా వచ్చారు. వాళ్ళల్లోనే ఎవరో మా అత్తగారింటికి, అమ్మా నాన్నలకు కబురు చేసారు. అందరూ నా చుట్టూ చేరి రమ్య సుగుణాలను కీర్తించడం మొదలెట్టారు. నాకు రమ్యపై వున్న ప్రేమను కొనియాడారు. గుండె దిటవు చేసుకొమ్మని ధైర్యం చెప్పారు.

నేను వారికి ఓ చక్కటి కథ వినిపించాను. ఇది చాలా చాలా పాత కథ. ఏదో డ్రాయింగ్ గీసుకోవడానికి తెల్లవారు ఝామునే లేచిన రమ్య, టీ చేసుకోవడానికి వెళ్ళింది. నిద్రమత్తులో స్టవ్ మీద రమ్య కొంగు పడింది. తరువాత షరా మామూలే !

మా ఆదర్శ దాంపత్యం చూసి కాలానికి కన్ను కుట్టిందని అందరూ వాపోయారు. మా ఇరుగు పొరుగుల్లో ఓ డాక్టర్ వచ్చి నా చేతికి వైద్యం చేసాడు.

ఇంతలో మా అత్తగారి బృందం బిలబిల మంటూ వూడి పడింది. నేను శృతి పెంచి వారితో పాటు ఏడవడం మొదలెట్టాను.

అప్పటికే రమ్యను దహన సంస్కారానికి సిద్ధం చేసేసి వుంచాను. పూలలో ఒదిగిన రమ్య మొహాన చెక్కు చెదరని చిరునవ్వు చూసి, అందరూ గుండెలు చెరువులు చేసుకొంటున్నారు.

నాకు వళ్ళంతా కారం రాసినట్లుగా వుంది.

చిట్టి నిర్లిప్తంగా ఓ పక్క నిల్చుని వుంది. నేను దాన్ని ఓ కంట కనిపెడుతూనే వున్నాను.

రమ్య పునిస్త్రీగా పోయి పుణ్యం కట్టుకుందని ఆడవాళ్ళంతా ఏదో తతంగం చేస్తున్నారు.

రమ్యను వదిలి పక్కకు వెళ్ళాలంటే నాకు భయంగానే వుంది. గబుక్కున విషయం బయటపడితే నా గతేం కాను ? ఎలాగోలా దహనం జరిగిపోతే తరువాత సంగతి తరువాత !

రమ్య మొహానికి పసుపురాసి, కుంకుమద్ది, హారతులిచ్చి - నెత్తిన బిందెల కొద్దీ నీళ్ళు గుమ్మరించారు. కొత్త చీర కట్టబెట్టడానికి వాళ్ళంతా దడికట్టారు.

ఇంతలో మా సిసింద్రీ మరదలు - రశ్మి కెవ్వున అరిచింది, "అమ్మా ... వళ్లంతా కాలినా ఒక్క బొబ్బయినా రాలేదేం ? జడ చెక్కు చెదిరిందేమో చూసారా ?" నాకు గుండె చిక్కబట్టింది. ఈ రశ్మితో ఎప్పటికైనా ప్రమాదమే !

నేను రశ్మి గొంతు వినబడనంతగా నా గొంతు పెంచి, శోకాలు పెట్టాను. ఇంతలో ఎవరో పిలిచినట్లు పోలీసులు దిగబడ్డారు.

రశ్మి - చిట్టి చేయి పట్టుకొని లాక్కెళ్ళి ఇన్‌స్పెక్టర్‌తో ఏవేవో చెప్పింది.

## ALWAYS LEFT

మహాకవి శ్రీ శ్రీకి చాలా గంభీరమైన విషయాలను కూడా అలవోకగా చెప్పేయడం అలవాటు. తమాషాగా చెప్పిన జోకులలో కూడా తన తాత్విక గాఢతకి లోటు రానివ్వరు. ఖమ్మంలో ఒక సాహిత్యసభలో పాల్గొనడానికి శ్రీశ్రీ వచ్చారు. నిర్వాహకులు ఆయన కోసం కారు తీసుకువచ్చారు.

శ్రీశ్రీ గారూ, మీరు రైట్‌సైడ్‌నుంచి ఎక్కండి అని నిర్వాహకులు ఆయన్ని కుడివైపుకి తీసుకు వెళ్ళారు.

శ్రీశ్రీ తక్షణమే

"లేదు లేదు. I am always left "అంటూ ఎడంవైపుకి వెళ్ళి పోయారు.

## ముఖచిత్ర కథనం

లియొనార్డో డావిన్సీ చిత్రించిన జినివ్రా డి 'బెన్సీ ఓ అరుదైన్న చిత్రంగా పేర్కొనవచ్చు. లియొనార్డో సాంకేతిక నైపుణ్యానికి ఈ చిత్రం ఓ సజీవ తార్కాణమని విమర్శకులు సైతం అంగీకరించారు. ఈ చిత్రంలోని విశేషం జినివ్రా వదనంపై వాలిన రింగులు తిరిగిన ఆమె ముంగురులు లియొనార్డో తన 'నోట్‌బుక్స్'లో ఈ ముంగురులను సుళ్ళు తిరుగుతున్న నీటితో పోల్చాడు. జినివ్రా చిత్రంలో ప్రతిబింబించిన అందమైన రంగులు మరో ఆకర్షణ. అందమైన చందమామ వెలుగంతా జినివ్రా వదనంలో ప్రతిబింబింపచేయటంలో లియొనార్డో కృతకృత్యులయ్యారన్నది నిర్వివాదాంశం.

లియొనార్డో చిత్రాలలో ఈ జినివ్రా డి'బెన్సీ విశేష ప్రాముఖ్యతను సంతరించుకుంది.

ఈ చిత్రానికి ఎందుకంత ప్రాధాన్యత అని అడగవచ్చు. లియొనార్డోలోని అద్భుత జిజ్ఞాస, సృజనకు ఆయన చిత్రించిన ముగ్గురు స్త్రీల చిత్రాలు నిదర్శనాలు. ప్రతి చిత్రం ఓ ప్రత్యేక అనుభూతిని ప్రతిబింబిస్తుంటుంది. అందులో మొట్టమొదటి ఈ జినివ్రా చిత్రం. రెండోది సెసీలియ గెలిరానీ, మూడవది - మోనాలిసా చిత్రం.

ఆయన వెంటనే రమ్యను స్మశానానికి కాక పోస్టుమార్టం చేయను ఆసుపత్రికి తరలించాలని అంబులెన్స్‌కు కబురు చేసాడు.

నేను భయపడినంతా అయ్యింది.

ఇన్‌స్పెక్టర్ అందరినీ ఏవేవో ప్రశ్నలడిగాడు. కూపీలు లాగాడు. కొన్ని వ్రాసుకున్నాడు. కొన్నింటికి తలాడించాడు.

మా ఇరుగు పొరుగు రమ్యతో నా ప్రవర్తన గురించి సూపర్‌క్లీన్ సర్టిఫికెట్ ఇచ్చారు నన్ను అనుమానించడం మా అన్యోన్యతను అవమానించడమేనని స్టేట్‌మెంట్ ఇచ్చారు.

పాపం వారికేం తెలుసు? వారెప్పుడు వచ్చినా నేను రమ్య బెణికిన చేతిని సరిచేస్తూనో ... తగిలిన గాయాలకు మందు రాస్తూనో కనిపించేవాడిని. మా సఖ్యతను చూసి ముచ్చట పడి, వచ్చిన పని మర్చిపోయి వెళ్ళిపోయేవారు.

అవి నా నిర్వాకం వలన కలిగిన బెణుకులు, తగిలిన గాయాలని వాళ్ళకెలా తెలుస్తుంది? రమ్యకు పొరుగిళ్ళ పెత్తనాలు చేసేంత తీరిక వుండదయ్యే !

మా ఆఫీసువాళ్ళు, రమ్య ఆఫీస్ వాళ్ళు అవే మాటలు అలాగే చెప్పారు. నేను రమ్యను ఎంత అపురూపంగా చూసుకొనే వాడినో - రమ్య పట్ల ఎంత బాధ్యతాయుతంగా ప్రవర్తించే వాడినో మామయ్య నొక్కి వక్కాణించాడు.

మంచి లాయర్లను పెట్టిస్తాను బెదిరిపోకు సుమా అని నాన్న నా చెవిలో గుసగుసలాడాడు.

ఆకస్మాత్తుగా మా వీధంతా నినాదాలతో మారుమోగిపోయింది.

ఇది రశ్మి నిర్వాకం. ఎప్పుడు జారుకుందో కానీ ఏదో మహిళా సంఘం వాళ్ళను పోగేసుకు వచ్చింది.

మా పద్ధతిలో మేం కొనసాగాం. పోస్ట్‌మార్టం రిపోర్టు ఇచ్చే డాక్టరు గారికి, ఇన్‌స్పెక్టర్ గారికి నాన్న సీల్డ్ కవర్లిచ్చి వచ్చాడు. కానీ ఆ పప్పులేం వుడకలేదు.

> స్త్రీలో గాని, కవి తన మార్దవ రసికత్వానికీ యీ లోకపు కర్కశత్వానికీ సమన్వయాన్నీ కనిపెట్టలేడు
>
> — చలం

మర్నాడు ఉదయం పత్రికల్లో చిట్టి ఫోటోతో - రశ్మి స్టేట్‌మెంట్ వచ్చింది. ఆ దరిమిలా రశ్మి నాపై కేసు పెట్టడం - చిట్టిని ప్రత్యక్ష సాక్షిగా నిలబెట్టం జరిగింది.

దీనికై రశ్మి చాలా ప్రతిఘటించాల్సి వచ్చింది. తన కుటుంబ సభ్యులతోనూ - బంధుమిత్రులందరిని ఎదురొడ్డి పోరాడాల్సి వచ్చింది. మేం కూడా రశ్మిని బెదిరించాం. భయ పెట్టాం. ఒక దశలో చిట్టిని కిడ్నాపు చేసిందని కేసు పెడదామన్నాడు మా లాయరు. ఏం తిప్పలు పడిందో కానీ రశ్మి ఆ అవకాశం రానీయలేదు. చిట్టి కూడా లొంగిరాలేదు.

రశ్మి చిట్టితో సహా ఎవరెవరి చుట్టూనో తిరిగింది. అభ్యర్థనలు చేసింది. సభలు, ర్యాలీలు నిర్వహించింది. రశ్మి కృషి వృధా పోలేదు.

నా ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

నా కవచం కూడా నాకు రక్షణ నివ్వలేదు. అది ఒట్టి డొల్ల అనీ - దాని మీద ఇన్నాళ్ళూ నాకున్న విశ్వాసమంతా ఒట్టి భ్రమేనని తేలిపోయింది.

నా చిన్నారి చిట్టి చిన్న పిడికిలి విసురుకే అది భళ్ళున బద్దలయ్యింది.

నేను నిస్సహాయంగా, ఒంటరిగా, దోషిగా నిలబడిపోయాను.

నా కవచం ఇన్నాళ్ళూ నా కళ్ళు కప్పేసింది.

ఈనాడు నా చుట్టూ అక్కలాంటి వాళ్ళూ ... రమ్య లాంటి వాళ్ళే కాదు రశ్మి లాంటి వాళ్ళూ వున్నారు. ఏం చేసినా చెల్లే కాలం చెల్లిపోయింది.

డొల్లలో ముడుచుకుపోయిన నేను సత్యాన్ని గ్రహించడానికి ఆలస్యమే జరిగింది. చివరకు నేను నమ్ముకున్న నా కవచమే నాకు ఉరితాడైంది.

ఎవరో వస్తోన్న అడుగుల చప్పుడు వినిపించింది. నేను ఒక్క సారిగా ప్రస్తుతంలోకి వచ్చి పడ్డాను.

ఇరుకు గది. నల్లని ఊచలు. చీకటి కంపు.

నేను నిట్టూర్చాను.

అడుగుల చప్పుడు మరింత స్పష్టంగా, లయబద్ధంగా వినిపిస్తోంది.

ఆ అడుగుల గమ్యం నా గదేనేమో.

నేను లేచి గోడకు చేరగిల పడ్డాను. నా కళ్ళముందు చిట్టి కదలాడింది. ఆ సోగకళ్ళూ ... ఉంగరాల జుట్టూ ... బుర్రముక్కూ.. బోసి నవ్వులు .. తప్పటడుగులు చిలిపి మాటలూ. అన్నీ ఒక్కొక్కటిగా జ్ఞాపకం వచ్చాయి.

నా హృదయం బరువెక్కింది. నా చెంపలు తడిచాయి.

ఆ రోజు కోర్టులో ఆ లేత మొహంలో కదలాడిన భావాలకు నేను ఎలా తట్టుకోగలిగాను? అసలా కళ్ళల్లో కదలాడింది అసహ్యమా ? ఆగ్రహమా ? ద్వేషమా ? మరేదయినా భావమా ?

పసి వయసులోనే చిట్టికి ఎంత పెద్దరికం వచ్చింది ! ఆ చిన్ని గుండె ఇంతటి బడబాగ్నిని ఎలా భరిస్తోందో ?

నా పెదవులు అప్రయత్నంగా వణికాయి.

ఏదో ఓ రోజు నా బంగారు తల్లికి కూడా రమ్యకు లాగే ..

నామెదడు మొద్దుబారిపోయింది.

ఎన్నాళ్ళుగానో నన్ను వెంటాడుతోన్న నవ్వు సన్నగా మొదలయ్యి నా గదంతా నిండిపోయింది.

ఆ నవ్వు .. నేను సహించలేని నవ్వు .. నన్ను దహించి వేసే నవ్వు... స్వేచ్ఛగా, స్వచ్ఛంగా నా చుట్టు ప్రకంపిస్తోంది.

"నా చిట్టిని - దయచేసి - అక్కలాగానో ... రమ్యలాగానో .. సౌమ్యమూర్తిగా, సహనశీలిగా పెంచకండి. తెలివిగా, ధీమాగా, ధైర్యంగా, ధర్మకోపం ప్రదర్శించగలిగేలా - రశ్మిలా ... పెంచండి. మరొకడు నాలా ఉరికంబం ఎక్కే స్థితి రాకూడదు. నాకు చివరి కోరికంటూ వుంటే ఇదే !"

పూడుకు పోయిన గొంతు దాటి రాని మాటలు నా పెదవుల మీద గొణుగుడుగా మారాయి.

నా మసకబారిన కళ్ళకు ఎవరో నా గది తలుపులు తెరవడం కనిపించకుండానే కనిపించింది.